పెద్దదిక్కు పెద్దాసుపత్రి

- ఓపీ టాప్.. ఐపీ డౌన్
- జూడాలు సమ్మె చేస్తున్నా ఆగని ఓపీ
- గత సోమవారం సైతం 3,076 నమోదు
- ప్రైవేటు బాట పడుతున్న ఇన్‌పేషంట్లు
- తగ్గిన ప్రసవాలు, మరణాల సంఖ్య


సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లు


కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

కర్నూలు(హాస్పిటల్): కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారం ఘటనను నిరసిస్తూ వారం రోజులుగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్య విద్యార్థులు (జూడాలు) తమ సేవలను బంద్ చేసి ఆందోళనలు చేస్తున్నారు. రోజురోజుకూ వీరి ఆందోళన ఉధృతం చేస్తున్నా ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. ఇక్కడి వైద్యులపై ఉన్న నమ్మకంతో ఏదో ఒక విధంగా చికిత్స చేయించుకువెళ్లాలనే ధోరణితో వారు ఆసుపత్రికి వస్తున్నారు. ఈ మేరకు ఎప్పటిలాగే ఓపీ సేవలు కొనసాగుతున్నాయి. అయితే ఇన్‌పేషంట్లుగా ఉన్న వారు సమ్మె కారణంగా వైద్యులు ఉండరనే భావనతో ప్రైవేటుకు వెళ్తున్నారు. మరోవైపు ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య, మరణాల సంఖ్య కూడా తగ్గడం ప్రశ్నార్థకంగా ఉంది.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు జిల్లా నుంచే గాకుండా నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, రాయచోటి, ప్రకాశం జిల్లాలతో పాటు పక్కనున్న తెలంగాణా, కర్నాటక రాష్ట్రాల నుంచి సరిహద్దు జిల్లాల నుంచి ప్రజలు చికిత్స కోసం వస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాసైనా ఎంతో ఓపికతో వేచి ఉండి చికిత్స చేయించుకునే వెళ్తారు. వీరి నమ్మకాన్ని వమ్ము చేయకుండా చాలా మంది వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కొందరు మాత్రం కొద్దిసేపు విధుల్లో ఉండి తర్వాత ప్రైవేటు బాటపడుతున్నారు. ఈ క్రమంలో పీజీ వైద్య విద్యార్థులు అందించే సేవలు ఎనలేనివి. ఆచార్యుల సూచనల మేరకు రోగులకు వైద్యం అందిస్తూ ఆరోగ్యంపై భరోసా కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. అయితే పది రోజుల క్రితం పశ్చిమబెంగాల్ రాష్ట్రం కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ హాస్పిటల్‌లో ఓ వైద్య విద్యార్థినిపై గుర్తుతెలియని దుండగులు అఘాయిత్యం చేసిన ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనను నిరసిస్తూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మొదట ఓపీ సేవలను జూనియర్ డాక్టర్లు బహిష్కరించారు. ఆ తర్వాత అత్యవసర సేవలనూ నిలిపివేశారు. దీంతో ఆసుపత్రి అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. పీహెచ్‌సీలు, మెడికల్ కాలేజీల నుంచి వైద్యులను రప్పించి ఇక్కడ డ్యూటీలు వేశారు. వారి సహాయంతో వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

తగ్గిన ఇన్‌పేషంట్ల సంఖ్య

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో 1,050 పడకల సామర్థ్యం ఉంది. నిత్యం 1,200 నుంచి 1500 మంది దాకా రోగులు చేరి చికిత్స పొందుతూ ఉంటారు. అయితే సమ్మె నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప రోగులను వార్డులో ఉంచుకోవడం లేదు. కాస్త బాగుందని భావించిన వారందరినీ డిశ్చార్జ్ చేస్తున్నారు. సీరియస్‌గా ఉన్న రోగులను మాత్రమే ఆసుపత్రిలో ఉంచుకుంటున్నారు. ఈ క్రమంలో ఇన్‌పేషంట్ల సంఖ్య వెయ్యిలోపే ఉంది. 14న 263, 15న 1,111 మంది, 16న 1,013 మంది, 17న 933 మంది, 18న 925 మంది, 19న 945 మంది చికిత్స పొందుతున్నారు.

తగ్గిన మరణాల సంఖ్య

ఆసుపత్రిలో ఇన్‌పేషంట్ల సంఖ్య తగ్గడం, వైద్యులు సమ్మె బాట పట్టడంతో కొందరు వైద్యులు, నర్సులు కలిసి రోగులను ప్రైవేటుకు వెళ్లాలని సూచిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు చాలా మంది ఆసుపత్రిలో డిశ్చార్జ్ చేయించుకుని ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. డాక్టర్లు సమ్మెలో ఉన్నారని, ఇక్కడ చూసే వారు ఎవ్వరూ లేరని, బయటకు వెళ్లాలని రోగులకు చెబుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలోనే ఇన్‌పేషంట్ల సంఖ్యతో పాటు మరణాల సంఖ్య కూడా తగ్గింది. ఆసుపత్రిలో ప్రతిరోజూ 20 నుంచి 25కు పైగా మరణాలు ఉంటాయి. కానీ 14న 20 మంది, 15న 15 మంది, 16న 14 మంది, 17న 14 మంది, 18న 18 మంది, 19న 20 మంది మరణించినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ప్రసవాలకు బయటకే..

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలంటే ప్రసవాలకు పెట్టింది పేరు. ఇక్కడ ప్రతిరోజూ 35 నుంచి 40 మంది ప్రసవం అయ్యేవారు. కానీ గత కొన్ని నెలలుగా ఈ విభాగంలో ప్రసవాల సంఖ్య తగ్గుతోంది. రోజుకు 20 నుంచి 30లోపు మాత్రమే ప్రసవాలు నమోదవుతున్నాయి. ప్రస్తుతం సమ్మె నేపథ్యంలో ఈ సంఖ్య మరింత తగ్గడం గమనార్హం. 14న 35 మంది, 15న 14 మంది, 16న 18 మంది, 17న 24 మంది, 18న 5 మంది, 19న 23 మంది మాత్రమే ప్రసవించారు. వైద్యుల సమ్మెతో పాటు ప్రైవేటులోనూ ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) ఉండటం కూడా ఇక్కడ ప్రసవాల సంఖ్య తగ్గడానికి ఒక కారణంగా చెబుతున్నారు. కేవలం సీరియస్ కేసులు మాత్రమే ఇక్కడకు చికిత్స కోసం వస్తున్నాయి. ఇతర సాధారణ కేసులన్నీ ప్రైవేటు ఆస్పత్రులకు వెళుతున్నాయి.

ఆపరేషన్లపై సమ్మె ప్రభావం

ఆసుపత్రిలోని పలు విభాగాల్లో శస్త్రచికిత్సలు సాధారణంగా జరుగుతున్నాయి. ఇన్‌పేషంట్లుగా ఉన్న వారికి, ఎంపిక చేసిన వారికి జాబితా ప్రకారం వైద్యులు శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. దీనికితోడు బయట అత్యవసర కేసులు తీసుకోని పరిస్థితుల్లో ఇక్కడకే రోగులు చికిత్స కోసం వస్తుంటారు. అయితే సమ్మెకు ముందు కంటే ప్రస్తుతం ఆపరేషన్ల సంఖ్యలో కాస్త తగ్గుదల కనిపించింది. ఈ నేపథ్యంలో మైనర్, మేజర్, ఎమర్జెన్సీ కలిసి ఈ నెల 14న 568 మంది, 15న 350 మంది, 16న 435 మంది, 17న 389 మంది, 18న 330 మంది, 19న 433 మందికి శస్త్రచికిత్సలు చేశారు.

● తగ్గని ఓపీ సేవలు

ఈ నెల 13వ తేదీ నుంచి వైద్య విద్యార్థులు నిరవధిక సమ్మెను ప్రారంభించారు. వీరికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌తో పాటు పలు ప్రజాసంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు సైతం గత శనివారం ఓపీ సేవలను నిలిపివేశాయి. ఈ క్రమంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోనూ ఓపీ సేవలు తగ్గుతాయని అందరూ భావించారు. అయితే ఎప్పటిలాగే ఓపీ సేవలు కొనసాగుతున్నాయి. 14వ తేదిన 2,364 మంది, 15న 1,531 మంది, 16న 2,374 మంది, 17న 1,897 మంది, 18న 640 మంది, 19న 3,076 మంది ఓపీ ద్వారా చికిత్స అందుకున్నారు. సాధారణంగా ఆసుపత్రిలో సోమవారం నుంచి బుధవారం వరకు ఎక్కువగా, గురు, శుక్ర, శనివారాల్లో కాస్త తక్కువగా ఓపీ ఉంటుంది. ఓపీ సంఖ్య 2,500 నుంచి 3 వేల దాకా ఉంటుంది. అయితే ప్రస్తుతం జూనియర్ డాక్టర్లు సమ్మె చేస్తున్నా ఓపీ సంఖ్య తగ్గకపోవడం విశేషం.

క్లుప్తంగా

దివ్యాంగ కక్షిదారులకు వీల్ చైర్ సదుపాయం


వీల్ చైర్లను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి

కర్నూలు(లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుంచి 10 వీల్‌చైర్లను జిల్లా కోర్టు, మున్సిఫ్ కోర్టులకు వచ్చే దివ్యాంగ కక్షిదారుల కోసం తెప్పించారు. ఈ సదుపాయాన్ని దివ్యాంగ కక్షిదారులు ఉపయోగించుకోవాలన్నారు.

మానవ మృగాలను ఉరి తీయాలి


కలెక్టరేట్ ఎదుట కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్యశాలలో పీజీ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన దోషులను ఉరితీయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున నిరసన చేపట్టారు. కొవ్వొత్తులు వెలిగించి వైద్యురాలి ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. మానవత స్వచ్ఛంద సంస్థ మహిళా విభాగం, పశుసంవర్ధక శాఖ, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. ఆ సంస్థ ప్రతినిధులు బ్రహ్మారెడ్డి, సురేష్‌కుమార్, మనోహర్‌రెడ్డి, గంగా, సైకాలజిస్టు జ్యోతిర్మయి పాల్గొన్నారు. అలాగే ఏపీయూడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గోరంట్ల, జిల్లా కన్వీనర్ నాగేంద్ర ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. దోషులను ఉరి తీయాలని డిమాండ్ చేశారు.

బీఎస్‌బీఎఫ్ కార్యవర్గ సభ్యుడి ఎన్నిక


పరశురాముడును సన్మానిస్తున్న క్రీడా సంఘాల ప్రతినిధులు

కర్నూలు (టౌన్): భారత షూటింగ్ బాల్ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులుగా కర్నూలుకు చెందిన పరశురాముడు ఎన్నికయ్యారు. గత వారం ఢిల్లీలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆంధ్రప్రదేశ్ నుంచి పరశురాముడిని కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో క్రీడా సంఘాల ప్రతినిధులు ఆయన్ను శాలువా సన్మానించారు. ఆయన ప్రస్తుతం భారత జట్టు మేనేజర్‌గా, ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, చిన్నసుంకన్న, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

30 మంది వార్డు కార్యదర్శులకు మెమోలు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో పనిచేసే 30 మంది వార్డు కార్యదర్శులకు కమిషనర్ రామలింగేశ్వర్ మంగళవారం నోటీసులు జారీ చేశారు. వాటర్ గ్యాప్ అనాలిసిస్ సర్వేలో నిర్లక్ష్యం ప్రదర్శించినందుకు కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు సర్వేను పరిశీలించగా కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ వెనుకబడి ఉంది. ఇప్పటివరకు 36 శాతం మాత్రమే సర్వే పూర్తి చేసినట్లు గుర్తించిన కమిషనర్ వారికి మెమోలు జారీ చేశారు. నోటీసులు అందుకున్న 30 మంది వార్డు కార్యదర్శులు తమ పనితీరును త్వరితగతిన మెరుగుపరచుకోవాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఎస్‌ఎంసీ సిల్వర్ జూబ్లీ పోస్టర్ విడుదల

కర్నూలు(అర్బన్): సెంట్రల్ మిలాద్ కమిటీ కర్నూలు 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్‌జూబ్లీ వేడుకలను సెప్టెంబర్ 4వ తేది నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ షఫీ పాషా ఖాద్రీ తెలిపారు. మంగళవారం స్థానిక లావుబాలి దర్గా ప్రాంగణంలో ఈ వేడుకలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమాల్లో భాగంగా మహమ్మద్ ప్రవక్త జయంతి కూడా నిర్వహిస్తామన్నారు. నాతియా ముషాయిరా, హుస్నే ఖిరాత్, మహఫిలై ఖవ్వాలీ, మహఫిలె నాత్, బ్లడ్ క్యాంప్, మెడికల్ క్యాంప్, అన్నదానం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మిలాద్ కమిటీ సభ్యులు రాషీద్ పాషా ఖాద్రి, హాజీ అబ్దుల్‌రహమాన్, నజీర్‌హుసేన్, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్): సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలోని పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లోని నదులు, వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని వివరించారు. దాదాపు నెలన్నర రోజులుగా వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతన్నలకు అనుకోకుండా ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి పంటలు దెబ్బతినడంతో దిక్కుతోచడం లేదన్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలు దెబ్బతినడంతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉచితంగా ఎరువులు, విత్తనాలు, మందులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

25న రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 25న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో అండర్- 12 విభాగంలో బాల బాలికలకు రగ్బీ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి రామాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2012, 2013, 2014 సంవత్సరాల తరు వాత పుట్టిన బాల బాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని ప్రకటించారు. వివరాలకు 93938 27585 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు (టౌన్): క్రీడలతో మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని బాస్కెట్‌బాల్ ఎరినాలో ఫ్లోర్ బాల్, షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఎంపికైన క్రీడాకారులు నిత్యం సాధన చేయడం వల్ల ఉత్తమంగా రాణిస్తారన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు, న్యాయవాది శ్రీధర్ రెడ్డి, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిశోధనాత్మక విద్యను అభ్యసించాలి


విద్యార్థులతో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ

కర్నూలు సిటీ: ఇంజినీరింగ్ చదివేందుకు బీటెక్‌లో చేరుతున్న విద్యార్థులు నిత్యం జీవితంలో వినియోగిస్తున్న వస్తువులు, టెక్నాలజీని వినియోగించడం కాదని, అవి ఎలా తయారు చేశారు? ఎందుకు, ఏమిటి, ఎలా అనేది తెలుసుకునేలా పరిశోధనాత్మక విద్యను అభ్యసించాలని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన వ్యక్తిత్వ వికాస కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకునే దశలో చెడు అలవాట్లు, వ్యసనాలకు దూరంగా ఉండాలని, లక్ష్యానికి తగ్గట్లు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఈ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలను కాదు అభ్యర్థులను చూడాలి

కర్నూలు సిటీ: యువ ఓటర్లు రాజకీయ పార్టీలను కాకుండా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రొఫైల్‌ను సమీక్షించాలని రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్ జేడీ లక్ష్మీనారాయణ సూచించారు. మంగళవారం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్(ట్రిపుల్‌ఐటీ డీఎం)లో బీటెక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులతో జరిగిన ఇండక్షన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల ప్రొఫైల్‌ను సమీక్షిస్తే ఎవరికి ఓటు వేయాలో స్పష్టత వస్తుందన్నారు. యువత ఇన్నొవేటర్స్, క్రియేటర్స్‌గా మారాలని పిలుపునిచ్చారు. యువత పత్రికలను రెగ్యులర్‌గా చదవడం అలవాటు చేసుకోవాలని, అందులో సరికొత్త ఆవిష్కరణలు, సమాజ సమస్యలతో పాటు, దేశ అవసరాలు తెలుస్తాయని వివరించారు. సమస్యలను పరిష్కరించే స్టార్టప్‌లపై దృష్టి పెట్టాలని సూచించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నివారణతోనే ఆరోగ్యం


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): దోమలను వివారిస్తేనే ఆరోగ్యంగా ఉంటారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ చెప్పారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎ.క్యాంపులోని మాంటిస్సోరి స్కూల్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఈ యేడాది దోమల రహిత సమాజం-ఆరోగ్యానికి సోపానం అనే నినాదంతో నివారణ, నియంత్రణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలను నియంత్రిస్తే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, బోధకాలు, మెదడువాపు వంటి వ్యాధులను నివారించవచ్చన్నారు. జిల్లా మలేరియా అధికారి నూకరాజు, బయాలజిస్టు వెంకటేశ్వర్లు, డెమో శ్రీనివాసులుశెట్టి, ఏఎంఓ చంద్రశేఖర్, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించండి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తే ఉద్యమించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం కర్నూలులోని గోకారి నగర్‌లో ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా జెండావిష్కరణ చేసి సమావేశాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడం లేదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే రైతన్నలకు ఏటా రూ.20 వేలు ఇస్తామని చెప్పి మోసం చేసే పరిస్థితికి వచ్చిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాదు, వెంకప్ప, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఖండ, మహేంద్రబాబు, నాయకులు మణెమ్మ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కౌన్సిల్ సమావేశాల్లో ఏఐకేఎంఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.రాజు, మల్లికార్జున, ఉపాధ్యక్షులు డి.రాజు, సహాయ కార్యదర్శి వెంకటస్వామి, కోశాధికారి ఖాజా మొహిద్దీన్, సభ్యులు యేసేబు, నాగేంద్రప్ప, జగదీష్, జయన్న, వీరేష్, శౌరప్ప, ఆనందరావు, రాజును ఎన్నుకున్నారు.


రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

కర్నూలు(సెంట్రల్): సాంకేతిక విప్లవానికి నాంది పలికిన నేత రాజీవ్ గాంధీ అని కర్నూలు డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు అన్నారు. మంగళవారం రాజీవ్‌గాంధీ జయంతి పురస్కరించుకొని స్థానిక డీసీసీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీక్యాంపులోని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేశారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ, పీసీసీ ప్రధాన కార్యదర్శి దామోదర రాధాకృష్ణ పాల్గొన్నారు.

22 నుంచి ఆటల పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీన 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, జిమ్నాస్టిక్స్ విభాగంలో 4 - 14 ఏళ్ల చిన్నారులకు ఫ్లోర్ ఎక్సర్ సైజ్‌లు, పదేళ్ల లోపు వారికి స్విమ్మింగ్, 10 - 12 ఏళ్ల వారికి 25 మీటర్లు, 50 మీటర్ల ఫ్రీస్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్ పోటీలు ఉంటాయని తెలిపారు. 23వ తేదీన బాల బాలికలకు బాస్కెట్‌బాల్, ఖోఖో క్రీడాంశంలో బాలురకు, ఫెన్సింగ్‌లో బాల బాలికలకు పోటీలు ఉంటాయని చెప్పారు. 24న బాల బాలికలకు బాస్కెట్‌బాల్, ఖోఖో క్రీడాంశంలో బాలికలకు, హాకీలో బాల బాలికలకు, స్కేటింగ్‌లో ఐదేళ్ల, 8, 10, 12 సంవత్సరాల బాల బాలికలకు, వెయిట్ లిఫ్టింగ్‌లో బాల బాలికలకు, యోగాలో పదేళ్లలోపు, 11 - 15 సంవత్సరాల్లోపు బాల బాలికలకు పోటీలు ఉంటాయని ప్రకటించారు. అలాగే 25వ తేదీన 12 ఏళ్లలోపు బాల బాలికలకు రగ్బీ క్రీడాంశంలో పోటీలు ఉంటాయన్నారు. పోటీలకు సంబంధించిన వివరాల కోసం 08518-225419 నంబర్ ఫోన్ చేయవచ్చన్నారు.

జాగ్రత్తలతో పిడుగుపాటు నుంచి రక్షణ


మాట్లాడుతున్న డాక్టర్ టీవీ సునీల్‌యాదవ్

కర్నూలు(హాస్పిటల్): భారీ ఉరుములు, పిడుగులు పడే సమయంలో జాగ్రత్తగా ఉండాలని మెడికవర్ హాస్పిటల్ ఎమర్జెన్సీ మెడిసిన్ హెడ్ డాక్టర్ టీవీ సునీల్ యాదవ్ చెప్పారు. స్థానిక హాస్పిటల్‌లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జాగ్రత్తలు పాటిస్తే పిడుగుపాటు నుంచి తప్పించుకోవచ్చని వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎత్తైన చెట్లు, టవర్లు, విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లకూడదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని, కొండలు, పర్వత ప్రాంతాలు, శిఖరాలు వంటి ఎత్తైన ప్రాంతాల నుంచి కిందకు వెళ్లాలన్నారు. పొలాల్లో పనిచేసే వారు ఇళ్లకు, సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని కుదరకపోతే తలను కిందకు వంచి, చేతులను గుండ్రంగా శరీరంపై కప్పి ఉంచాలని సూచించారు. ఆ సమయంలో కాలి వేళ్లు మాత్రమే భూమిని తాకేలా ఉండాలన్నారు. నిటారుగా నిలబడరాదని, గుంపులుగా ఉండరాదని, చెరువులు, సరస్సులు, ఈత కొలనులు, బీచ్‌లు వంటి బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలని వివరించారు.

త్వరలో 'గ్రామ దర్శిని' కార్యక్రమం


మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా


కర్నూలు(సెంట్రల్): శిశు సంరక్షణ సెంటర్లు, హాస్టళ్లను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో హాస్టళ్లు, చైల్డ్‌కేర్ సెంటర్ల తనిఖీలు, ఉద్యోగుల బదిలీలు, వంద రోజుల ప్రణాళికలపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న 21 చైల్డ్ కేర్‌సెంటర్లు, 85 బీసీ, ఎస్టీ, ఎస్సీ మైనార్టీ హాస్టళలను రెండు రోజుల్లో తనిఖీ చేసి నివేదిక సమర్పించాలన్నారు. చైల్డ్ కేర్ సెంటర్ల తనిఖీ సమయంలో రిజిస్ట్రేషన్ ఉందా? మౌలిక వసతులు ఎలా ఉన్నాయి? హాస్టళ్లలో మెనూ ప్రకారం పిల్లలకు భోజనం పెడతున్నారా? బయోమెట్రిక్ అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఉద్యోగుల బదిలీలను పూర్తి చేయాలని, వంద రోజుల లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లోని సమస్యలను తెలుసుకునేందుకు త్వరలో గ్రామ దర్శిని కార్యక్రమం అమలు చేయనున్నట్లు తెలిపారు. జేసీ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, ఇన్‌చార్జ్ డీఆర్వో చిరంజీవి పాల్గొన్నారు.

మినీ జాబ్‌మేళాలో 18 మందికి ఉద్యోగాలు


జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

కర్నూలు(సెంట్రల్): ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ జాబ్‌మేళాలో 18 మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి పి.దీప్తి తెలిపారు. మంగళవారం కార్యాలయ ఆవరణలో నిర్వహించిన మేళాకు భరత్ ఫైనాన్సియల్ ఇన్‌క్లూషన్ ప్రైవేట్ లిమిటెడ్, నవభారత్ ఫెర్టిలైజర్స్, ఏయూ స్మాల్ ఫినకేర్ బ్యాంకు ప్రతినిధులు వచ్చి 60 మంది నిరుద్యోగులకు ఇంటర్వ్యూ చేశారని, అందులో 18 మందికి ఆయా కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. జాబ్‌మేళాలను యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. జూనియర్ ఉపాధి కల్పనా అధికారి సోమశివారెడ్డి పాల్గొన్నారు.

ఆటోల దొంగ అరెస్ట్


ఆటో దొంగను అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: కర్నూలులో రెండు ఆటోలు, మహబూబ్ నగర్‌లో ద్విచక్ర వాహనం చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న దొంగను నాల్గవ పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాల్లోకి పంపారు. కర్నూలు శివారు సంతోష్ నగర్‌లో నాయకల్లు రమేష్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా అతని నేరాల చిట్టా బయటపడింది. ఓర్వకల్లు మండలం నన్నూరుకు చెందిన రమేష్ కర్నూలులో రెండు ఆటోలు, మహబూబ్ నగర్‌లో ఒక మోటార్‌సైకిల్ చోరీ చేసినట్లు అంగీకరించాడు. అతనిపై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ మధుసూదన్‌గౌడు తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి


మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగర పాలకసంస్థ పరిధిలోని శివారు కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పి.నిర్మల, నగర కార్యదర్శి టి.రాముడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సూర్యనారాయణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. శివారు కాలనీల్లో రోడ్లు వేయాలని, డ్రెయినేజీలు నిర్మించాలని, తాగునీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. పాణ్యం పరిధిలోని 16 వార్డుల్లో రోజూ మంచినీరు ఇచ్చేలా చూడాలన్నారు. ప్రస్తుతం మూడు రోజులకోసారి మంచినీరు వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఆయా సమస్యలకు పరిష్కారం చూపడంపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో నరసింహులు, సుధాకర్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కర్నూలు (టౌన్): గోనెగండ్ల మండలం గంజిహాళ్లి గ్రామంలో పగలు, రాత్రి అన్న తేడా లేకుండా యథేచ్ఛగా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారని ఆ గ్రామానికి చెందిన పలువురు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాకు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా గనులు భూగర్భ వనరుల శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్‌ను ఆదేశించారు. దీంతో గనుల శాఖ అధికారులు ఆ గ్రామంలో ఇసుక అక్రమ రవాణాపై విచారణ జరిపారు. ఇసుక అక్రమ తరలింపు ఎంత మేర జరిగిందనే విషయంపై రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరిచే పంచనామా చేసి కలెక్టర్‌కు నివేదిస్తామని వారు వెల్లడించారు. అలాగే ఎమ్మిగనూరులో అనుమతులు లేకుండా రోడ్డు మెటల్ తరలిస్తున్న టిప్పర్‌ను అధికారులు సీజ్ చేశారు. టిప్పర్ యజమాని నుంచి జరిమాన వసూలు చేస్తామని వారు స్పష్టం చేశారు.